చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ప్రముఖులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 25: ఏసుక్రీస్తు పుట్టినరోజును పురస్కరించుకొని క్రిస్మస్ వేడుకలను జిల్లావ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రార్థనా మందిరాలను అందంగా ముస్తాబు చేశారు. క్రైస్తవులు ఉదయాన్నే చర్చిలకు వెళ్లి క్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేకులు కట్‌చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పాస్టర్లు క్రీస్తు బోధనలను భక్తులకు వినిపించారు. వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

నిజాంసాగర్ మండలకేంద్రంలోని బెరకా ప్రార్థనా మందిరం, మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని చర్చిలో నిర్వహించిన వేడుకల్లో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. మహ్మద్‌నగర్‌లో సర్పంచ్ బాలమణి క్రైస్తవులకు గిఫ్ట్ ప్యాక్‌లను పంపిణీ చేశారు.

సర్వమతాల సారం ఒక్కటే: ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ పట్టణంతోపాటు వర్ని మండల కేంద్రంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేర్వేరు ఆచార వ్యవహారాలతో ఇష్టదైవాలను పూజించినా, సర్వమతాల సారాంశం ఒక్కటేనని అన్నారు. తనకు ఐదో తరగతి వరకు మోజస్ మాస్టర్ విద్యాబుద్ధులు నేర్పారని గుర్తుచేశారు. ఆయన మరణిస్తే అంత్యక్రియల్లోనూ తాను పాల్గొన్నట్లు చెప్పారు. ధర్మం, ప్రేమానురాగాలు ఉన్నచోట దేవుడి ఆశీర్వాదం ఉంటుందన్నారు. క్రీస్తు దీవెనలతో ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాసేవ చేస్తున్నానని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యం ఇచ్చిందని, ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. మున్సిపల్ చైర్మన్ గంగాధర్, డాక్టర్ అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, వర్ని ఏఎంసీ వైస్ చైర్మన్ గోపాల్, సొసైటీ అధ్యక్షుడు సాయిబాబా, నాయకులు గిరి, రంజ్యానాయక్, రెడ్డి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో పోచారం శ్రీనివాసరెడ్డికి కేక్ తినిపిస్తున్న పాస్టర్

నిజాంసాగర్‌లో కేక్ కట్‌చేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

కామారెడ్డిలోని సీఎస్ఐ చర్చిలో క్రీస్తు ప్రవచనాలను బోధిస్తున్న పాస్టర్

మహ్మద్‌నగర్ చర్చిలో క్రైస్తవులకు గిఫ్ట్ ప్యాక్‌లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ బాలమణి

నిజాంసాగర్ చర్చిలో భక్తులకు బైబిల్‌ను బోధిస్తున్న పాస్టర్ ఏలీషా

డోంగ్లీ గ్రామంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

బస్వాపూర్ చర్చిలో ప్రార్థనా గీతాలు ఆలపిస్తున్న భక్తులు, పాస్టర్ జాన్సన్

ఇబ్రహీంపేట్ గ్రామంలో క్రిస్మస్ వేడుకలు

సంగమేశ్వర్‌లో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

సదాశివనగర్ మండలం దగ్గి చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రిస్టియన్లు

28న జూనియర్స్ అథ్లెటిక్స్ సెలక్షన్స్

కామారెడ్డి, డిసెంబర్ 25 : కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్స్ అథ్లెటిక్స్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో అండర్ 14, 16 బాలబాలికలు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. అండర్ 14 వారికి 60 మీ, 600 మీ. హైజంప్, లాంగ్ జంప్, అండర్ 16 వారికి 60 మీ, 600 మీ, హైజంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, జావెలిన్ త్రో అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. బర్త్ సర్టిఫికెట్, ఎస్ఎస్‌సీ మెమో జిరాక్స్‌తో ఉదయం 8 గంటలకు జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియానికి రావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 25 : మండలంలోని కొయ్యగుట్ట సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఐదో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

జీవాలకు టీకాల పంపిణీ

నస్రుల్లాబాద్, డిసెంబర్ 25 : బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో మూగజీవాలకు టీకాలు, నట్టల నివారణ మందును సోమవారం పంపిణీ చేశారు. 21 గేదెలకు గర్భకోశ వ్యాధులు, 13 గేదెలకు సాధారణ చికిత్స, 46 దూడలకు నట్టల నివారణ మందును వేసినట్లు డాక్టర్ రోహిత్ తెలిపారు. 68 సీమ పందులకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు చెప్పారు. పశు వైద్యాధికారి మారుతి, గోపాలమిత్ర అంజనీ కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

కోటగిరి, డిసెంబర్ 25 : మండల కేంద్రంలో నూతనంగా చేపడుతున్న అయ్యప్ప, సాయిబాబా మందిరం నిర్మాణ పనులను యాదాద్రి స్థపతి డాక్టర్ మోతీలాల్ పరిశీలించారు. వచ్చే ఏడాదిలోగా ఆలయ నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ విఠల్‌రావు గుప్తా, పల్లెంపాటి శివరామకృష్ణయ్య ఉన్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం

దోమకొండ, డిసెంబర్ 25 : మండల కేంద్రంలోని శ్రీచాముండేశ్వరీ దేవి దేవాలయంలో అమ్మవారి రాజగోపుర నిర్మాణానికి దోమకొండకు చెందిన చెన్న పద్మాశంకర్ దంపతులు రూ.5,511 విరాళంగా అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి తీర్థప్రసాదాలు, మెమెంటోని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పాలకుర్తి శేఖర్, ధర్మకర్తలు, ఆలయ పూజారి తదితరులు పాల్గొన్నారు.

బడాపహాడ్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలి

వర్ని, డిసెంబర్ 25 : మండలంలోని బడాపహాడ్ దర్గా వద్ద పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి భక్తులకు రక్షణ కల్పించాలని సీపీఎం వర్ని ఏరియా కన్వీనర్ నన్నేసాబ్ కోరారు. వర్ని ఎస్సై కృష్ణకుమార్‌కు ఈ మేరకు ఆయన సోమవారం వినతిపత్రం అందజేశారు. బడాపహాడ్ పుణ్యక్షేత్రానికి మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని తెలిపారు. త్వరలో ఉర్సు నిర్వహించనున్న నేపథ్యంలో పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి భక్తులకు భరోసా కల్పించాలని కోరారు. సీపీఎం నాయకులు సాయిబాబా, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, DONTHI SOUJANYA, D/o. Donthi Sudhakar, R/o. 5-3-642/2, vidya Nagar Colony, Kamareddy-503 111, TS. Changed My Name as DONTHI SOUMYA, D/o. Donthi Sudhakar.
NT-324491

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1993-94 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 25 : ఉపాధ్యాయుల యోగక్షేమాలు.. చిన్ననాటి మిత్రుల ఆత్మీ పలకరింపులు.. 30 ఏండ్ల తర్వాత చోటుచేసుకున్న ఈ అపూర్వ కలయికకు మండలలోని దేశాయిపేట్ ప్రభుత్వ పాఠశాల వేదిక అయ్యింది. అదే పాఠశాలకు చెందిన 1993-94 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఆత్మీ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పాఠశాల ఆవరణలో కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు దేవదాస్, రబ్బాని, మొగులయ్య, తుకారాం, అశోక్, పూర్వ విద్యార్థులు చంద్రశేఖర్, రాము, సాయిలు, ఉమా, అంజలి పాల్గొన్నారు.

బాన్సువాడలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర

బాన్సువాడ/రామారెడ్డి, డిసెంబర్ 25 : అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా స్వామివారి అక్షింతలు సోమవారం బాన్సువాడ పట్టణంతోపాటు రామారెడ్డి మండల కేంద్రానికి చేరుకున్నాయి. రామజన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అక్షింతలు, కలశాలను పల్లకీలో ఏర్పాటుచేసి ఊరేగించారు. ఈ సందర్భంగా రామారెడ్డిలో చిన్నారులు సీతా రాముల వేషధారణతో సందడి చేశారు. బాన్సువాడ పట్టణంలో మినీ స్టేడియం నుంచి శ్రీరామ కాలనీలోని రామాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అక్షింతలను ప్రతి ఇంటికీ అందజేయనున్నట్లు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, రామారెడ్డి సర్పంచ్ సంజీవ్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, హిందూ ధర్మ రక్షణ సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కలశాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళా భక్తులు

వాజ్‌పేయికి ఘన నివాళి

మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని జిల్లా కేంద్రంతోపాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి, భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు.

-కామారెడ్డి/భిక్కనూరుడి/బాన్సువాడ/ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 25

కామారెడ్డిలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డి బీజేపీ కార్యాలయంలో..

బోరంచ పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

భూమిపూజ చేస్తున్న సర్పంచ్ నాగరాజు, గ్రామ పెద్దలు

ఎల్లారెడ్డి, డిసెంబర్ 25 : మండలంలోని అన్నాసాగర్ గ్రామ శివారులో బోరంచ పోచమ్మ ఆలయ నిర్మాణానికి సర్పంచ్ నాగరాజు గ్రామ పెద్దలు సోమవారం భూమిపూజ చేశారు. దాతలు, గ్రామస్తుల సహకారంతో పోచమ్మ ఆలయాన్ని నిర్మిస్తున్నామని సర్పంచ్ తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

నిజాంసాగర్, డిసెంబర్ 25: జుక్కల్ మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో హనుమాన్, యమధర్మరాజు విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలను పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు మహిళల మంగళహారతుల మధ్య విగ్రహాలతో ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో విశేష పూజలు కొనసాగాయి. మూడు రోజులపాటు వేడుకలు కొనసాగుతాయని పద్మశాలీ సంఘ సభ్యులు తెలిపారు.

ప్రధాన కాల్వలో ప్రవహిస్తున్న నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలైన నీరు

కొనసాగుతున్న 'సాగర్' నీటి విడుదల

నిజాంసాగర్, డిసెంబర్ 25: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టు పంటల సాగు కోసం నీటి విడుదల కొనసాగుతున్నది. ప్రధాన కాలువ ద్వారా 1700 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని ఏఈ శివకుమార్ తెలిపారు. ఆయకట్టు రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి విడుదలను హెచ్చుతగ్గులుగా విడుదల చేస్తున్నామని, ఇప్పటి వరకు 1.58 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు (17.80 టీంఎసీలు) కాగా, ప్రస్తుతం 1402.68 అడుగుల (14.57 టీఎంసీలు) మేర నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

అన్నదానంలో పాల్గొన్న భక్తులు

సదాశివనగర్, డిసెంబర్ 25 : మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో అన్నదానం కొనసాగుతున్నది. దాతల సహకారంతో ప్రతిరోజూ భక్తులు, అయ్యప్ప మాలధారులకు జనవరి 5వ తేదీ వరకు అన్నదానం చేస్తామని గురుస్వాములు హోటల్ రాజు, చిట్టేపు వీరారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.